




సంచలన సాయంకాల పత్రిక


# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 7-7-2025

సంపుటి: 21 సంచిక: 89
పేజీలు: 8 వెల: రూ.1


## సూపరింటెండెంట్‌కు
# గ్రేడ్-3 ఏఎన్ఎంల సెగ



- ఛాంబర్‌లో బైఠాయించి ఆందోళన
- రీ-కౌన్సిలింగ్ నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్
- వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో గందరగోళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


వైద్యఆరోగ్యశాఖ సూపరింటెండెంట్‌కు గ్రేడ్-3 ఏఎన్ఎంల సెగ తగిలింది. సచివాలయం గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీల్లో అవినీతి, అక్రమాలపై బాధిత ఏఎన్ఎంలు సోమవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలోని సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఆందోళనకు దిగారు. రీ-కౌన్సిలింగ్ నిర్వహించి న్యాయం చేయాలని ఏఎన్ఎంలు నిరసన చేపట్టారు. బదిలీల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏకపక్ష వైఖరి కారణంగా తీవ్రంగా నష్టపోయామని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత ఏఎన్ఎంలు బైఠాయించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లిపోవడంతో కార్యాలయంలో సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్‌ను, ఏవో బాబురావును నిలదీశారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఖాళీలను బ్లాక్ చేసి వాటిని చూపించకుండా జూమ్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తే జిల్లాలో మాత్రం జూమ్ ద్వారా కౌన్సెలింగ్ చేయడం ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధమన్నారు. గడువులోగా కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేస్తే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ - మిగతా చివరి పేజీలో



## అతడి కబంధహస్తాల్లో
# బీసీ శాఖ బందీ!

- జిల్లా బీసీ సంక్షేమ శాఖలో రిటైర్డ్ ఉద్యోగి పెత్తనం
- రెండు హాస్టళ్లకు షాడో వార్డెన్‌గా చెలామణీ
- డీబీసీడబ్ల్యూవోగా ఎవరొచ్చినా వారితో కుమ్మక్కు
- బదిలీలు, ఇన్‌ఛార్జిల నియామకాల్లోనూ హవా

**ఆ రెండు హాస్టళ్లు ఆయన చేతిలో బందీ అయిపోయాయి. అలా అని ఆయన ఆ కార్యాలయ అధికారా? అంటే కాదు.. కనీసం ఉద్యోగి కూడా కాదు. ఒకప్పుడు ఈ శాఖలో పని చేసిన ఆయన పదవీ విరమణ చేసి చాలా ఏళ్లయిపోయింది. అయినా బీసీ సంక్షేమ శాఖలో ఆచారి చక్రం తిప్పుతున్నారని చెప్పడం పాత విషయం. డీబీసీడబ్ల్యూవోగా ఎవరు వచ్చినా ఆచారి చెప్పినట్టే నడుచుకోవడంపై అనేకసార్లు అనేక పత్రికల్లో కథనాలు వచ్చినా ఉన్నతాధికారులు పట్టించుకోకుపోవడం పాత విషయం. అయితే ఈ శాఖలో బదిలీలు, పదోన్నతుల విషయంలోనూ ఆచారి తన టాలెంట్‌ను మరోసారి బయటపెట్టడమే కొత్త విషయం.**



REGISTRAR OFFICE SKU ATP 08554255805 P.01

123

SRI KRISHNADEVARAYA UNIVERSITY :: ANANTAPUR
CENTRE FOR DISTANCE EDUCATION

No. SKU/CDE/D1/2012 Date: 11.01.2012

From
DIRECTOR

To
Sri G. Venkat Ram Reddy I.A.S.,
Collector
Srikakulam.

Sir,

Sub:- SKU-CDE- Verification of Educational Certificates-Regarding.

Ref:- Your letter No. RC No. D2/16/2009, dt. 11.01.2012.

***

With reference to your letter cited above, I am to inform you that the Xerox copies of the following Marks Statement/Certificates submitted by you for verification is verified with our Office records and the Genuinity is as follows.

| S. No. | Name of the Candidate | Course | Register No. | Month & Year | Remarks |
|---|---|---|---|---|---|
| 1. | Mullu Gunavathi | BA (HPE) | B06509265 | July, 2009 | Genuine. |

This is for your information.

Yours faithfully,
Deputy Registrar
Centre for Distance Education
Sri Krishnadevaraya University,
ANANTAPUR - 515 055. A.P

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీసీ సంక్షేమ శాఖ పరిధిలో రణస్థలం మండలం కొమరవానిపేట బాలురు, జీరుపాలెం బాలికల వసతి గృహాలకు ఒకే ఉద్యోగి ఐదేళ్లకు పైగా వార్డెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల బాగోగులు పట్టించుకోకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న వార్డెన్ గుణవతిని తక్షణమే బదిలీ చేయాలని ఆయా గ్రామాలకు చెందిన మత్స్యకారులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఐదేళ్లకు పైగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న గుణవతిని బదిలీ చేయకుండా ఆ శాఖ డీడీ అనురాధ తాత్సారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు గుణవతి పదేళ్ల క్రితమే ఉద్యోగ విరమణ చేసిన ఆచారి అనే వ్యక్తికి హాస్టల్ నిర్వహణ బాధ్యతలు అప్పగించి.. ఆమె విధులకు దూరంగా ఉంటున్నారని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచారి హాస్టల్‌లో అనధికారికంగా విధులు వెలగబెట్టడానికి వీలుగా.. గుణవతికి కేవలం రెండుచోట్లకు మాత్రమే బదిలీ అయ్యేటట్టు జిల్లాస్థాయిలో మేనేజ్ చేస్తున్నారు. ఆ మేరకు జీరుపాలెం లేదా కొమరవానిపేట హాస్టళ్లకు మాత్రమే ఆమెను బదిలీ చేస్తున్నారు. ఇందులో ఏ ప్రాంతానికి బదిలీ అయినా మరో ప్రాంతానికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఈ విధంగా గత ఏడేళ్లుగా గుణవతికి బదులు విధులు నిర్వహిస్తున్న ఆచారి ఈ రెండు స్థానాల్లో కుర్చీలాట ఆడిస్తున్నారు. మొదట జీరుపాలెం బదిలీ చేసి కొమరవానిపేట ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. తర్వాత కొమరవానిపేటకు బదిలీ చూపించి జీరుపాలేనికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇలా గుణవతిని ఆ రెండుచోట్లకు తప్ప వేరొక చోటకు బదిలీ చేయలేదు. కొమరవానిపేట బాలుర వసతి గృహం కాబట్టి పెద్దగా ఎవరికీ ఇబ్బంది లేదు. కానీ - మిగతా చివరి పేజీలో



# జిల్లాకే పెద్దన్న.. దాసన్న



- నాడు కుటుంబానికి అన్నగా పూర్తి న్యాయం
- సోదరుడి రాజకీయ ఉన్నతికి బాటలు
- పార్టీకి, అధినేతలకు అపర విధేయుడిగా ముద్ర
- అధికారంలో ఉండగా ఎన్నో అభివృద్ధి పనులు
- కష్టకాలంలో పార్టీని నడిపించే నేతగా గుర్తింపు



**జిల్లా రాజకీయాల్లో ఆయనదో ప్రత్యేక స్థానం. ప్రత్యర్థులు కూడా అన్నా అని సంబోధించి ఆప్యాయత కనబరిచేలా చేసే వ్యక్తిత్వం ఆయన సొంతం. పార్టీపరంగా ఎన్ని విభేదాలు ఉన్నా.. వ్యక్తిగతంగా ఎవరి జోలికి పోని నికార్సయిన రాజకీయవేత్త, అజాత శత్రువు. అన్నా.. అని పిలిస్తే చాలు మురిసిపోయి కావలసింది చేసే పెట్టే బోళాతనం ఆయన సొంతం. ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నది నానుడి. దాన్ని నూటికి నూరుపాళ్లు సార్థకం చేసిన నాయకుడు ధర్మాన కృష్ణదాస్. తొలుత తన కుటుంబాన్ని తండ్రిలా, పెద్దన్నలా నడిపిన ఆయన.. తర్వాత గ్రామ రాజకీయాల నుంచి జిల్లా రాజకీయాల వరకు కూడా అదే పాత్రను దిగ్విజయంగా పోషించారు.. ఇప్పటికీ పోషిస్తున్నారు. విశ్వసనీయతకు, నమ్మకానికి కూడా మారుపేరుగా దాసన్న నిలుస్తున్నారు.**





✍ డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

పోలాకి మండలం మబగాంలో ధర్మాన రామలింగం నాయుడికి ఉన్నతస్థాయి కుటుంబం. రాజకీయంగానే కాకుండా సాహితీరంగంలోనూ మంచి పేరు, కళా పోషకులన్న ఖ్యాతి సొంతం చేసుకున్న రామలింగం నాయుడు, సావిత్రమ్మల సంతానంలో జ్యేష్టుడే (పెద్ద కుమారుడు) ధర్మాన కృష్ణదాస్. రామలింగంనాయుడు తదనంతరం ఇంటి పెద్దకుమారుడిగా, తన సోదరులకు అన్నగా తన బాధ్యతలు పరిపూర్ణంగా నిర్వహించారు. అన్న అనే పదంలోని 'అ' అంటే.. అమ్మ, 'నా' అంటే.. నాన్న అని అర్థం. ఆ రెండక్షరాలు, ఆ రెండు బంధాలు కలిస్తే అన్న. ఆ హోదాకు పూర్తి న్యాయం చేసిన వ్యక్తి ధర్మాన కృష్ణదాస్. కుటుంబాన్నే కాదు.. కుటుంబానికి ఉన్న పేరుప్రఖ్యాతులను కూడా కాపాడుకుంటూ వచ్చి.. తనకంటే చిన్నవారైనా సోదరులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లడంలో ఆయన చేసి శ్రమ, కృషి అసామాన్యం.

### తమ్ముడి ఉన్నతికి ఒక్క మాటతో ఊతం

తొలినాళ్లలో కృష్ణదాస్ ప్రభుత్వ ఉద్యోగం చేసేవారు. అయితే స్వగ్రామం మబగాం రాజకీయాల్లో ఆయన కుటుంబం కీలకపాత్ర పోషించేది. అయితే తండ్రి మరణించడం, తాను ఉద్యోగం చేస్తున్న సమయంలో 1981లో టంగుటూరి అంజయ్య రాష్ట్ర ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. ఇదే అదనుగా రామలింగం నాయుడు లేని ధర్మాన కుటంబంపై ఆధిపత్యం సాధించాలని అత్యాశకుపోయారు. కవ్వింపు రాజకీయాలకు తెరతీశారు. దమ్ముంటే ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నికల్లో తమపై పోటీ చేసి గెలవాలని వారు కృష్ణదాస్‌ను సవాల్ చేశారు. అయితే 'నా వరకు ఎందుకు.. నా తమ్ముడిని నిలబెడతాను.. సత్తా ఉంటే గెలవండి చూద్దాం' అంటూ కృష్ణదాస్ ప్రతి సవాల్ విసిరారు. అన్నట్లుగానే ఆ ఎన్నికల్లో తన సోదరుడు ధర్మాన ప్రసాదరావును ఎన్నికల బరిలోకి దించి, సర్పంచ్‌గా తొలి ప్రయత్నంలోనే గెలిపించి ప్రత్యర్థులను చిత్తు చేసిన ఘనత కృష్ణదాస్‌ది. ఆ విధంగా తాను ప్రత్యక్ష రాజకీయాల్లో లేకపోయినా తమ్ముడి రాజకీయ ఉన్నతికి సోపానం వేశారు. అందుకు తగినట్లే ధర్మాన ప్రసాదరావు శరవేగంగా రాజకీయ పరమపద సోపానం అధిరోహించారు. 1985లోనే తొలిసారి ఎమ్మెల్యే టికెట్ అందుకున్న ఆయన ఆ ఎన్నికల్లో రెండువేల స్వల్పతేడాతో ఓడిపోయారు. అయితే 1987లో పోలాకి ఎంపీపీగా గెలిచారు. ఆ తర్వాత రెండేళ్లకే 1989 ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రెండేళ్లకే 1991లో నేదురమల్లి జనార్ధనరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతు స్వీకరించారు. అలా జగన్‌తో సహా ఆరుగురు ముఖ్యమంత్రుల వద్ద పని చేసిన ఘనత సాధించారు. అంటే.. ధర్మాన ప్రసాదరావు రాజకీయ ఉన్నతికి ఆనాడు అన్న కృష్ణదాస్ చేసిన సవాల్, జరిపిన ప్రచార పోరాటమే పునాదిగా నిలిచాయని చెప్పడం అతిశయోక్తి కాబోదు.

### నాడు వైఎస్.. నేడు జగన్

ఎంతో సౌమ్యుడు, అజాతశత్రువుగా, తనను నమ్మి గెలిపించిన ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయని నేతగా పేరు పొందిన కృష్ణదాస్ తాను నమ్మిన నాయకుల పట్ల కూడా అంతే విశ్వసనీయత, విధేయతతో మెలగుతున్నారు. 2004లో ధర్మాన ప్రసాదరావు నరసన్నపేట నుంచి శ్రీకాకుళం నియోజకవర్గానికి షిఫ్ట్ కావడంతో ఆ ఎన్నికల్లో కృష్ణదాస్‌కు నరసన్నపేట నుంచి పోటీ చేసే అవకాశం లభించింది. ఆనాటి పీసీసీ అధ్యక్షుడు వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర సమయంలోనే ఆయనకు మద్దతుగా రాజకీయాల్లోకి వచ్చిన దాసన్న అక్కడి నుంచి వైఎస్‌కు అనుచరుడిగా మారిపోయారు. అదే ఆయన్ను నరసన్నపేట నుంచి పోటీ చేసే అవకాశం కల్పించింది. ఆ ఎన్నికల్లో గెలిచి తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆయన 2009లో కూడా విజయం సాధించారు. అయితే వైఎస్ హఠాన్మరణం తర్వాత మారిన రాజకీయ పరిణామాలు, వైఎస్ కుమారుడు జగన్‌ను కాంగ్రెస్ నాయకత్వం ఒంటరిగా వదిలేయడం చూసి దాసన్న తీవ్రంగా చలించిపోయారు. పార్టీపై ధిక్కార స్వరం వినిపించి, ఎమ్మెల్యే పదవిని తృణప్రాయంగా త్యజించారు. జగన్ వెంట నడవడం ప్రారంభించిన ఆయన 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైకాపా జెండాతో పోటీ చేసి మళ్లీ ఎమ్మెల్యే అయ్యారు. 2019 ఎన్నికల్లో మళ్లీ గెలిచిన కృష్ణదాస్‌పై పార్టీ అధినేత జగన్ కూడా నమ్మకం ఉంచి కీలకమైన రెవెన్యూ శాఖతోపాటు ఉప ముఖ్యమంత్రి పదవి కూడా ఇచ్చారు. పార్టీ అధికారంలోకి రాకముందు చాన్నాళ్లు జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన దాసన్న మొన్నటి ఎన్నికల్లో అధికారం కోల్పోయి కష్టాలో పడిన ఈ సమయంలో కూడా జిల్లా పార్టీ పగ్గాలు చేతబట్టి పార్టీకి, అధినేతకు తాను విధేయుడినని నిరూపించుకున్నారు. అలాగే తనను గెలిపించిన ప్రజల నమ్మకాన్ని కూడా నిలబెట్టుకున్నారు. మంత్రిగా ఉన్నప్పుడు కొమనాపల్లి-సరుబుజ్జిలితో సహా పలు వంతెనల పనులు పూర్తి చేయించి రవాణా సౌకర్యాలు మెరుగుపరిచారు. ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయించారు. కృష్ణదాస్ రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు జిల్లాల విభజన జరిగింది. ఆ సమయంలో శ్రీకాకుళానికి పక్కనే ఉన్న పారిశ్రామిక ప్రాంతమైన ఎచ్చెర్ల నియోజకవర్గం విజయనగరం జిల్లాలో కలిసిపోతుందని శ్రీకాకుళం జిల్లా ప్రజలు భయపడ్డారు. కానీ వారి ఆకాంక్షలను సీఎం జగన్ వద్ద వినిపించి ఎచ్చెర్లను శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించడంలో దాసన్న విజయం సాధించారు.

• ఎడిటోరియల్

## విమానాలకు జీపీఎస్ స్పూఫింగ్ ముప్పు

ఆధునిక యుగంలో అన్నిరంగాల పనితీరు మారుతున్నట్లే యుద్ధాల రీతీ మారుతోంది. అదేవిధంగా ఉగ్రవాద కార్యకలాపాలు, శత్రువులపై నేరుగా కాకుండా పరోక్షంగా కక్ష సాధించే లేక పగ తీర్చుకునే కార్యకలాపాలు సైతం ఆధునిక సాంకేతికను సంతరించుకుంటున్నాయి. ఇటీవలి కాలంలో రష్యా-ఉక్రెయిన్, భారత్-పాకిస్తాన్, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య జరిగిన యుద్ధాలు సంప్రదాయ పద్ధతిలో కాకుండా ఆధునిక సాంకేతికతతో కూడిన డ్రోన్లు వంటి నవీన ఆయుధాలు కీలకపాత్ర పోషించాయి. ఆ సంగతి పక్కన పెడితే ఉగ్రవాదులు కూడా ఆధునిక సాంకేతికను దుర్వినియోగం చేస్తూ ఆయా దేశాలను చికాకుపెడుతున్నారు. తరచూ జరుగుతున్న విమాన ప్రమాదాలు, అత్యవసర ల్యాండింగుల వెనుక ఉగ్రవాదుల దుష్ట పన్నాగాలు ఉన్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనికి అతిపెద్ద ఉదాహరణ గత నెల 12న జరిగిన ఘోర విమాన దుర్ఘటన. ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ మీదుగా లండన్ వెళ్తున ఈ ఎయిర్ ఇండియా విమానం అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో టేక్‌ఆఫ్ తీసుకున్న ఐదు నిమిషాల్లోనే సమీపంలోని నివాస ప్రాంతంలో కుప్పకూలిపోయింది. ఫలితంగా విమానంలో ఉన్న క్రూ, ప్రయాణికులతో పాటు సమీపంలోని వసతిగృహంలో ఉన్న మెడికోలతో సహా సుమారు 260 మంది దుర్మరణం పాలయ్యారు. ప్రపంచంలోని అతిపెద్ద విమాన ప్రమాదాల్లో ఒకటిగా నిలిచిన ఈ దుర్ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. విమానానికి చెందిన రెండు ఇంజిన్లు ఫెయిల్ అవ్వడమో.. విద్యుత్ సరఫరా నిలిచపోవడమే ప్రమాదానికి కారణమని భావించినా, దీని వెనుక ఉగ్రవాదుల కుట్ర ఉందన్న భావన తాజా దర్యాప్తు ద్వారా కలుగుతోంది. విమానానికి చెందిన గ్లోబల్ పొజీషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) వ్యవస్థను హైజాక్ చేసి విమానాన్ని దుండగులు కూల్చివేశారన్న అనుమానాలు బలపడుతున్నాయి. గతంలో ఉగ్రవాదులు విమానాలకు విమానాలనే భౌతికంగా హైజాక్ చేసి ప్రభుత్వాలను బ్లాక్‌మెయిల్ చేసి తమ డిమాండ్లు సాధించుకునేవారు. కానీ ఇప్పుడు విమానాన్ని నడిపించే అతి కీలకమైన జీపీఎస్‌ను ట్రాక్ చేసి దాన్ని స్పూఫ్ చేయడం (సిగ్నల్స్‌ను తారుమారు చేయడం) దారా ప్రమాదాలకు గురయ్యేలా చేస్తున్నారని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్న మాట. ఇటువంటి ఘటనలు పెరగడం కూడా వారి వాదనలను బలపరుస్తోంది. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 2023-2024 మధ్య జీపీఎస్‌లో అక్రమ చొరబాట్ల(ఇంటర్‌ఫియరెన్స్) రేటు 175శాతంగా ఉంది. ఇదే సమయంలో జీపీఎస్ స్పూఫింగ్ ఘటనలు 500 శాతం పెరిగాయి. ఇక 2023 నవంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు మన దేశ సరిహద్దుల్లోనే 465 జీపీఎస్ స్పూఫింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. అమృత్‌సర్, జమ్మూ ప్రాంతాల్లోనే ఇవి అధికంగా జరగడం గమనార్హం. గత నెలలో ఢిల్లీ నుంచి జమ్మూకు బయలుదేరిన విమానం కొద్దిసేపటికే తిరిగివచ్చింది. జీపీఎస్ సంకేతాల్లో ఏదో తారుమారు జరుగుతున్నట్లు అనుమానం రావడంతో పైలట్లు ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని వెనక్కి మళ్లించారు. అలాగే భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) చెందిన సి-130జే విమానం ఏప్రిల్‌లో మయన్మార్ గగనతలంపై ప్రయాణిస్తుండగా జీపీఎస్ స్పూఫింగ్ జరిగింది. దాంతో అప్రమత్తమైన పైలట్ దాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. జీపీఎస్ సిగ్నల్ వ్యవస్థలోకి విద్రోహులు చొరబడుతున్న ఘటనలు, స్పూఫింగ్ లేదా జామింగ్ అనేవి పెనువిపత్తుగా మారుతున్నాయి. స్పూఫింగ్ వల్ల విమానాన్ని నడిపే పైలట్‌కు జీపీఎస్ తప్పుడు మార్గం, తప్పుడు గమ్యస్థానం చూపిస్తాయి. దాంతో నిర్దేశిత మార్గం నుంచి దారి మళ్లి విమానం మరో మార్గంలోకి వెళుతుంది. దీనివల్ల గగనతలంలో విమానాలు పరస్పరం ఢీకొనే ప్రమాదం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఎత్తయిన భవనాలు, కొండలను ఢీకొట్టొచ్చు. అలాగే ర్యాష్‌గా రన్‌వే పైకి దూసుకెళ్లడం ద్వారా ప్రమాదాలకు కారణం కావచ్చు. కల్లోలిత ప్రాంతాల్లో జీపీఎస్ స్పూఫింగ్ సమస్య అధికంగా ఉంది. 2024లో శాటిలైట్ సిగ్నల్ జామింగ్ లేదా స్పూఫింగ్ ఘటనలు 4.3 లక్షలు నమోదయ్యాయి. 2023లో ఈ సంఖ్య 2.6 లక్షలు. అంటే ఏడాదిలోనే 62 శాతం పెరిగాయి. ఈజిప్టు, లెబనాన్, నల్ల సముద్రం, రష్యా-ఎస్తోనియా, రష్యా-లాత్వియా, రష్యా-బైలారస్ సరిహద్దుల్లో స్పూఫింగ్ బెడద ఎక్కువగా ఉందని ఎయిర్‌లైన్స్ సంస్థలు చెబుతున్నాయి. ఇలాంటి ఘటనలపై అలర్ట్ చేసేందుకే అమెరికాలో ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఒక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది.



లీడ్స్‌లో జరిగిన పరాజయం, కేవలం ఒక మ్యాచ్‌లో ఓటమి కాదు. అది భారత్ లాంటి దేశా నికి, క్రికె ట్ ఒక మతమైన దేశానికి, ఒక చిన్నపాటి ఆత్మవిశ్వాస లోటు. క్రికెట్ అంటే కేవలం ఆటగాళ్ళ మధ్య బంతి, బ్యాట్ యుద్ధం కాదు. అది కోట్లాది మంది అభిమానుల ఆశలు, ఆకాంక్షలు, కలలు, భావో ద్వేగాల ప్రతీక. అందుకే లీడ్స్ పరాజయం, కేవలం పరుగుల లోటు కాదు, ఎక్కడో ఒక మూల మన ఆశలపై చిన్న నీలినీడ.కానీ, గొప్ప జట్లు, గొప్ప వ్యక్తులు ఎప్పుడూ పరాజయాన్ని శాశ్వతంగా అంగీకరిం చరు. వారు దానిని ఒక గుణపాఠంగా తీసుకుంటారు, తమను తాము మెరుగుపరుచుకుంటారు, మరియు అంతకు ముందు కంటే రెట్టింపు శక్తితో తిరిగి పోరాడుతారు. భారత్ జట్టు ఎడ్జ్‌బాస్టన్‌లో అదే చేసింది. లీడ్స్ లోని గాయాలను మాన్చుకుంటూ, ఎడ్జ్‌బాస్టన్ గడ్డపై అద్భుత విజయాన్ని అందుకుంది. ఇది కేవలం ఒక విజయం కాదు, ఇది ఆత్మవిశ్వాసం తిరిగి రావడానికి, పట్టుదలకు, జట్టు స్ఫూర్తికి, మరియు ముఖ్యంగా, భారతీయుల ఎప్పటికీ తగ్గని ఆశకు ప్రతీక.

## ఓటమి నుంచి..విజయం

# భారత్ ఆత్మ విశ్వాసపు అడుగులు

### విజయం వెనుక దాగి ఉన్న వేదాంతం.. ఒక ఓటమి నుండి వెయ్యి పాఠాలు!

ప్రతి విజయం వెనుక ఒక పోరాటం ఉంటుంది. ప్రతి పోరాటం వెనుక ఒక కథ ఉంటుంది. లీడ్స్‌లో జరిగిన ఓటమి, భారత జట్టుకు కొన్ని కీలకమైన పాఠాలను నేర్పింది. బ్యాటింగ్ లైనప్‌లో స్థిరత్వం లేకపోవడం, బౌలింగ్‌లో పదును తగ్గడం, ఫీల్డింగ్‌లో తడబాటు- ఇలాంటి లోపాలను లీడ్స్ మ్యాచ్ స్పష్టంగా చూపించింది. అయితే, గొప్ప జట్టు యొక్క లక్షణం ఏమిటంటే, ఆ లోపాలను సరిదిద్దుకోవడానికి తక్షణమే చర్యలు తీసుకోవడం. ఎడ్జ్‌బాస్టన్‌లో మనం చూసింది అదే.

జట్టులో మార్పులు, వ్యూహాత్మక నిర్ణయాలు, ప్రతి ఆటగాడి వ్యక్తిగత ప్రదర్శనలో మెరుగుదల.. ఇవన్నీ కలిసి ఒక అద్భుతమైన విజయాన్ని అందించాయి. ఇది కేవలం స్కోర్‌బోర్డుపై పరుగుల సంఖ్య కాదు. ఇది ఒక జట్టుగా, ఒక సమూహంగా, ఒకరికొకరు తోడుగా నిలబడి, ఎదురైన సవాళ్లను అధిగమించిన తీరుకు నిదర్శనం. ఒక మ్యాచ్ ఓడిపోతే ప్రపంచం మొత్తం మునిగిపోదని, కానీ ఆ ఓటమి నుండి నేర్చుకుంటేనే నిజమైన విజేతలు అవుతారని ఈ మ్యాచ్ రుజువు చేసింది.

### ఎడ్జ్‌బాస్టన్ అఖండ విజయం.. భారత క్రికెట్ స్ఫూర్తికి నిదర్శనం!

ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్ ప్రదర్శించిన ఆధిపత్యం కేవలం క్రీడా మైదానానికే పరిమితం కాదు. ఇది మన దేశం యొక్క స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. భారతదేశం అంటేనే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, వాటిని విజయాలుగా మార్చుకునే సత్తా ఉన్న దేశం. మన చరిత్రలో ఎన్నో ఒడిదు దుకులు, ఎన్నో పరాజయాలు ఉన్నాయి. కానీ ప్రతిసారీ మనం మరింత బలంగా, మరింత దృఢంగా తిరిగి లేచాం. క్రికెట్ మైదానం కూడా అలాంటిదే.

జట్టులోని ప్రతి ఆటగాడు తమ పాత్రను సక్రమంగా పోషించారు. బ్యాట్స్‌మెన్ క్రీజులో నిలదొక్కుకొని భారీ పరుగులు సాధించారు. బౌలర్లు నిప్పులు చెరిగిన బంతులతో ప్రత్యర్థులను కట్టడి చేశారు. ఫీల్డర్లు అద్భుతమైన క్యాచ్‌లతో, పరుగులను ఆదా చేస్తూ జట్టుకు అండగా నిలిచారు. ఇది కేవలం వ్యక్తిగత ప్రతిభ కాదు, ఇది జట్టు సమష్టి కృషికి, పరస్పర సహకారానికి ప్రతీక. కెప్టెన్ వ్యూహాలు, కోచ్ మార్గదర్శనం, ఆటగాళ్ల కఠోర సాధన.. ఇవన్నీ కలిస్తేనే ఈ అద్భుత విజయం సాధ్యమైంది.

### క్రికెట్.. ఒక ఆట మాత్రమేనా? ఒక జాతి ఆత్మప్రతిబింబం!

భారతదేశంలో క్రికెట్ కేవలం ఒక ఆట కాదు. ఇది ఒక పండుగ, ఒక ఉద్వేగం, ఒక జీవన విధానం. క్రికెట్ మ్యాచ్ చూసేటప్పుడు మనలో ఏ భేదాలు ఉండవు. మతం, కులం, భాష, ప్రాంతం.. ఇవన్నీ పక్కనపెట్టి, మనం భారతీయులం అనే ఒకే ఒక్క భావనతో ఏకమవుతాం. టీమిండియా గెలిస్తే దేశం మొత్తం సంబరాల్లో మునిగిపోతుంది. ఓడిపోతే చిన్నపాటి నిరాశ కమ్ముకుంటుంది. ఇది మన దేశ ఐక్యతకు, సమగ్రతకు ఒక ప్రతీక.

ఎడ్జ్‌బాస్టన్ విజయం కోట్లాదిమంది భారతీయుల హృదయాలను ఉప్పొంగించింది. ఒక పరాజయం తర్వాత ఇంత గొప్పగా తిరిగి పుంజుకోవడం, మనందరికీ ఒక స్ఫూర్తి. జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు నిరాశ పడకుండా, వాటిని అధిగమించడానికి ప్రయత్నించాలనే సందేశాన్ని ఈ విజయం ఇస్తుంది. ఆటలో గెలుపోటములు సహజం, కానీ ముఖ్యమైనది గెలవడానికి పడే ప్రయత్నం, ఓటమి నుండి నేర్చుకునే గుణం.

### భవిష్యత్ దారులు.. ఈ విజయం ఒక మలుపు!

ఎడ్జ్‌బాస్టన్ విజయం భారత జట్టుకు ఒక కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇది రాబోయే మ్యాచ్‌లకు ఒక బలమైన పునాదిని వేసింది. ఈ విజయం నుండి పొందిన ఆత్మవిశ్వాసంతో, టీమిండియా భవిష్యత్తులో మరిన్ని గొప్ప విజయాలను సాధిస్తుందని ఆశిద్దాం. ఆటగాళ్లలో కనబడిన అంకితభావం, పట్టుదల, మరియు విజయం పట్ల దాహం.. ఇవన్నీ భారత క్రికెట్ సువర్ణ భవిష్యత్తుకు సంకేతాలు.

క్రికెట్ కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు, ఇది జీవిత పాఠాలను నేర్పే ఒక పాఠశాల. విజయం ఎలా నిలదొక్కుకోవాలో, పరాజయం నుండి ఎలా నేర్చుకోవాలో, మరియు ఒక జట్టుగా ఎలా పనిచేయాలో క్రికెట్ మనకు నేర్పుతుంది. ఎడ్జ్‌బాస్టన్ విజయం మనందరికీ ఒక గొప్ప స్ఫూర్తి. ఈ విజయం మనల్ని మత్తులో ముంచెత్తకూడదు, బదులుగా మరింత కష్టపడటానికి, మరింత ఉన్నతమైన లక్ష్యాలను సాధించడానికి ప్రేరేపించాలి.

- రవి వారణాశి




# రొటీన్ కథకు ఎమోషనల్ టచ్!

ఒకప్పుడు తెలుగులో పెద్ద పెద్ద హిట్లు కొట్టి.. ఆ తర్వాత వరుస ఫ్లాపులతో కనుమరుగైపోయిన తమిళ నటుడు సిద్దార్థ్. కొన్నేళ్లుగా తమిళంలోనే సినిమాలు చేస్తూ వాటి అనువాదాలతో తెలుగు ప్రేక్షకులను పలకరిస్తున్నాడు. కానీ సరైన ఫలితం దక్కలేదు. కానీ తన కొత్త చిత్రం '3 బీహెచ్‌కే' మాత్రం ట్రైలర్‌తో అంచనాలు పెంచింది. మరి సినిమా ఆ అంచనాలకు తగ్గట్లే ఉందా?..తెలుసుకుందాం పదండి.

**కథ:** వాసుదేవన్ (శరత్‌కుమార్) ఒక మధ్యతరగతి వ్యక్తి. చిన్న ఉద్యోగం చేస్తూ భార్య ఇద్దరు పిల్లలతో జీవితాన్ని సాగిస్తున్న అతడికి సొంతంగా ఒక ఇల్లు కొనుక్కోవడం కల. అందుకోసం ప్రతిసారీ ప్రయత్నం చేయడం.. అంతా ఓకే అనుకున్నాక ఏదో ఒక అడ్డంకి వచ్చి ఆ కల తీరకపోవడం.. ఇలాగే ఏళ్లకు ఏళ్లు గడిచిపోతాయి. కొడుకు ప్రభు (సిద్దార్థ్) ఎదిగి వచ్చాక అయినా ఆ కల నెరవేరుతుందనుకుంటే అది జరగదు. ఓవైపు కోరుకున్న ఉద్యోగం చేయట్లేదనే అసంతృప్తి ప్రభును వెంటాడుతుంటే.. మరోవైపు వాసుదేవన్ కూతురి వైవాహిక జీవితంలో ఇబ్బందులు తప్పవు. ఇన్నిసమస్యల మధ్య సొంత ఇంటి కలను పక్కన పెట్టేస్తాడు వాసుదేవన్. మరి వీళ్లందరి సమస్యలు తీరాయా లేదా.. ఇంతకీ వీరి సొంతింటి కల ఏమైంది.. అన్నది మిగతా కథ.

**నటీనటులు:**

సిద్దార్థ్ చాన్నాళ్ల తర్వాత తనకు నప్పే పాత్రను ఎంచుకున్నాడు. నటన కొత్తగా ఉందని చెప్పలేం కానీ.. ప్రభు పాత్రకు అవసరమైనట్లు నటించాడు. వేర్వేరు వయసులకు తగ్గట్లుగా తన లుక్‌ను మార్చుకునేందుకు అతను పడ్డ కష్టం తెరపై కనిపిస్తుంది. ఆయా వయసులకు తగ్గ హావభావాల్లోనూ వైవిధ్యం చూపించాడు. శరత్ కుమార్ తన అనుభవాన్ని చూపించాడు. వాసు పాత్రకు న్యాయం చేశాడు. ఆయనకు జంటగా నటించిన దేవయాని కూడా బాగా చేసింది. హీరో చెల్లెలి పాత్రలో 'గుడ్ నైట్' ఫేమ్ మీథా రఘునాథ్ ఆకట్టుకుంది. సిద్ధుకు జోడీగా నటించిన చైత్ర హీరోయిన్ లాగా కాకుండా ఒక పాత్రధారిలా కనిపించడం భిన్నంగా అనిపిస్తుంది. యోగిబాబు పర్వాలేదు. తన నుంచి ఆశించే స్థాయి కామెడీ అయితే ఇందులో లేదు.

**సాంకేతిక వర్గం:**

అమృత్ రామ్ నాథ్ సినిమా నడతకు తగ్గ నేపథ్య సంగీతాన్ని అందించాడు. చాలా వరకు ఎమోషనల్ టచ్ కనిపిస్తుంది బీజీఎంలో. కొన్నిసార్లు డోస్ ఎక్కువైనట్లు అనిపిస్తుంది. దినేష్ కృష్ణన్-జితిన్ ల ఛాయాగ్రహణం బాగుంది. విజువల్స్ ఆకట్టుకుంటాయి. నిర్మాణ విలువలు సినిమాకు అవసరమైన స్థాయిలో ఉన్నాయి. రాకేందు మౌళి మాటలు బాగున్నాయి. రచయిత-దర్శకుడు శ్రీ గణేష్.. ప్రస్తుతం తమిళ చిత్రాల సక్సెస్ ట్రెండును అందిపుచ్చుకునే కథను ఎంచుకున్నాడు. ఎమోషనల్ సీన్లను బాగా డీల్ చేశాడు. కానీ తన స్క్రీన్ ప్లే రొటీన్ గా సాగింది. ఎక్కువమంది కనెక్ట్ అయ్యే కథ రాసుకోవడం బాగున్నా.. తన టేకింగ్ మాత్రం సోసోగానే సాగింది.

**కథనం-విశ్లేషణ:**

ఒకప్పుడు వైవిధ్యమైన కథలకు.. ప్రయోగాత్మక చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది తమిళ సినీ పరిశ్రమ. కానీ గత దశాబ్ద కాలంలో అక్కడి సినిమాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. మూస చిత్రాలతో విసుగెత్తించేస్తున్నారు అక్కడి దర్శకులు. ఐతే తమిళ సినిమాలు పూర్తిగా గాడి తప్పుతున్న దశలో కొందరు యువ దర్శకులు.. ఫీల్‌గుడ్ సినిమాలతో కొంత ఉపశమనాన్ని అందిస్తున్నారు. గుడ్ నైట్.. కుటుంబస్థాన్.. టూరిస్ట్ ఫ్యామిలీ లాంటి చిత్రాలు 'స్లైస్ ఆఫ్ లైఫ్' కథలతో ప్రేక్షకులను కదిలించాయి. మధ్యతరగతి మనుషుల జీవితాలను తరచి చూస్తూ.. వారి ఆశలు ఆకాంక్షల చుట్టూ కథనాన్ని నడిపిస్తూ.. అంతిమంగా ఒక జీవిత పాఠాన్ని నేర్పడానికి ప్రయత్నించిన కథలు ఇవి. ఈ కోవలోనే '3 బీహెచ్‌కే' కూడా తెరకెక్కింది. ఐతే టైటిల్.. ట్రైలర్ చూస్తేనే ఇది ఎలాంటి సినిమానో ఒక అంచనా వచ్చేస్తుంది. సినిమాలో అంతకుమించి కొత్తగా సర్ప్రైజులేమీ ఉండవు. ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ ఉన్నా.. కొన్ని మూమెంట్స్ హృద్యంగా అనిపించినా.. తెలిసిన కథే కథా చూస్తున్నాం అనే ఒక మొనాటనస్ ఫీలింగ్ కలిగిస్తుందీ సినిమా. కాకపోతే సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి ఒక మధ్య తరగతి కుటుంబం చేసే పోరాటం చుట్టూ తిరిగే కథ కాబట్టి.. ఎక్కువమంది ఈ కథతో రిలేట్ చేసుకునే అవకాశముండడం దీనికి ఉన్న ప్లస్.

సమాజంలో అత్యధిక సంఖ్యలో ఉండే వర్గం.. మధ్యతరగతి వారే. వాళ్లందరికీ 'సొంత ఇల్లు' అనేది పెద్ద ఎమోషన్. ఇల్లు ఉన్న వారికీ అది ప్రత్యేకం. ఇక దాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఏళ్ల తరబడి కష్టపడేవాళ్లకు దాంతో ఉండే ఎమోషన్ ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ పాయింట్ మీద కథను ఎంచుకోవడంలోనే రైటర్ కమ్ డైరెక్టర్ శ్రీ గణేష్ సగం విజయం సాధించేశాడు. ఈ పాయింట్ చుట్టూ కథా విస్తరణ కూడా సరిగా జరిగి ఉంటే.. కొన్ని సర్ప్రైజులను జోడించి ఉంటే.. '3 బీహెచ్‌కే' ఒక ప్రత్యేకమైన సినిమాగా నిలిచేది. కానీ ప్రేక్షకులను ఏమాత్రం ఆశ్చర్యపరచని విధంగా.. చాలా రొటీన్‌గా సాగిపోయే ఎపిసోడ్ల వల్ల '3 బీహెచ్‌కే' చాలా వరకు సాధారణంగానే అనిపిస్తుంది. ఇల్లు కొనడానికి సన్నాహాలు చేసుకోవడం.. అంతలోనే ఏదో ఒక అడ్డంకి రావడం.. ఇలా ఒకట్రెండు సార్లు జరగ్గానే ఈ కథ ఎలా నడవబోతోంది.. ఎలా ముగియబోతోంది అన్నది ఒక అంచనా వచ్చేస్తుంది. ఒక దశ దాటాక చూస్తే.. పనిగట్టుకుని హీరో కుటుంబాన్ని కష్టాలు పెడుతున్నట్లు అనిపిస్తుంది. మెలోడ్రామా శ్రుతి మించిపోతుంది. ఎంతకీ వేగం పుంజుకోని కథనంతో సగం వరకు '3 బీహెచ్‌కే' చాలా సాధారణంగా అనిపిస్తుంది.

ఐతే ద్వితీయార్ధంలో ఇంటి గొడవ పక్కకు వెళ్లి.. హీరో ఉద్యోగ-వ్యక్తిగత జీవితం.. తన చెల్లెలి వైవాహిక జీవితం చుట్టూ కథ నడవడం మొదలుపెట్టాక ప్రేక్షకులకు కొంచెం ఉపశమనం దక్కుతుంది. ఇక్కడ కూడా కథనం కొంచెం ఎగుడుదిగుడుగానే సాగినప్పటికీ.. ప్రథమార్ధంతో పోలిస్తే సెకండాఫ్ చాలా మెరుగ్గానే అనిపిస్తుంది. చివరి అరగంటలో ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్ సినిమా గ్రాఫ్‌ను పెంచుతుంది. సెక్యూరిటీ.. కంఫర్ట్ పేరుతో జీవితానికి పరిమితులు విధించుకోకుండా అభిరుచి మేరకు బతకడమే ముఖ్యమని చెప్పే చివరి అరగంట '3 బీహెచ్‌కే'లో హైలైట్‌గా నిలుస్తుంది. పతాక సన్నివేశాలు హృద్యంగా సాగి సినిమాకు మంచి ముగింపునిస్తాయి. ఫీల్ గుడ్.. ఎమోషనల్ సినిమాలను ఇష్టపడేవాళ్లు.. మరీ అంచనాలు పెట్టుకోకుండా ఒకసారి చూడ్డానికి '3 బీహెచ్‌కే' ఓకే.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

## సార్వత్రిక సమ్మెను కౌలురైతుల సంఘం మద్దతు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కార్మిక హక్కులకై జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని కౌలు రైతుల సంఘం సంపూర్ణ మద్దతిస్తుందని కౌలు రైతులు సంఘం జిల్లా నాయకులు బి.ఆనందరావు అన్నారు. ఈమేరకు సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ కార్మిక జీవనాడి చట్టాలను రద్దు పరిచి కార్పొరేట్ అనుకూల చట్టాలు తేవడం కోసం నాలుగుకోడ్లుగా మార్చి కార్మికులపై దాడికి పూనుకుందన్నారు. బీజేపీ అధికారం వచ్చిన నాటినుండి వేతన సవరణ జరపకుండా కాలయాపన చేస్తుందన్నారు. కార్మికులకు 8గంటల పనిదినాన్ని ఉండాలని పోరాటం చేసి సాధించుకున్న మే డే స్ఫూర్తిని దెబ్బతీసి 10 గంటలు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ఉపసంహరించుకోకపోతే ఈ సమ్మె హెచ్చరిక అవుతుందన్నారు. పని గంటలు నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు పోరాటం తప్పదన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు స్కీం వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు పెరిగిన ధరలు కనుగొనగా ఉండా లని సిఫార్సు చేసిందని, దానిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర నల్లచట్టాలు రద్దు పరిచిన స్థానే కనీసం మద్దతు ధర చట్టం చేయాలని కౌలు రైతుకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని సార్వత్రిక సమ్మెలో అంతర్భాగంగా పాల్గొంటున్నామన్నారు. ఏ మండల పరిధిలో ఉన్న కౌలు రైతులు రైతులు కార్మికులు ఆయా మండల పరిధిలో హెడ్క్వార్టర్లో జరిగే నిరసన ప్రదర్శనలో పాల్గొని ఈనెల 9 సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వరం కాలనీని బాగు చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



వరం కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు కోరారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ను సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు వరం కాలనీ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కమిషనర్ను కలిశామన్నారు. పార్కుని ఆనుకొని ఉన్న రోడ్డుకిరువైపులా మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. వీటిని స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పట్టణంలో కళాశి కాలనీ, వీరనాయుడు కాలనీ, లప్పర్స్ కాలనీ ప్రాంతాలలో సోమవారం పర్యటించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, నరసన్నపేట

## సీసీ రోడ్ను ప్రారంభించిన ఎమ్మెల్యే కూన

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

మండలంలో శ్రీనివాసచార్యులపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్డును ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 1.38కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించిన ఘనత కూటమి ప్రభుత్వందేనన్నారు. అదేవిధంగా గ్రామంలో రైతన్నలకు ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న పశువుల దానా బస్తాలను పంపిణీ చేశారు. అనంతరం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేశారు. ఎవరికి ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని ఆయన కోరారు.





శ్రీకాకుళం నియోజవర్గం 20వ డివిజన్లో గడపగడపకు తెలుగు దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో డివిజన్ ఇంచార్జి ఇప్పిలి తిరుమలరావు, 20వ డివిజన్ కన్వీనర్ కీర్తి భార్గవ్ నాయుడు తదితరులు పాల్గొని కూటమి ప్రభుత్వ పాలనను వివరించారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## పెద్దపాడులో సుపరిపాలన తొలి అడుగు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు లక్ష్యమని శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు చేపట్టిన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీకాకుళం నగర పరిధిలోని పెద్దపాడులో పార్టీ శ్రేణులతో కలసి ఆయన పర్యటించారు. గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధినీ వివరించారు. అనంతరం అయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో అధికశాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. నవ్యంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. తాము ఇచ్చిన హామీలను అమలు చేసాం కాబట్టే ధైర్యంగా తొలి అడుగుతో ప్రజల మధ్యకు వచ్చామన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్చార్జిలు నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇంచార్జిలు. క్లస్టర్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత సమ్మెలో పెన్షనర్లు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9న జరిగే అఖిలభారత సమ్మెలో పెన్షనర్లు పాల్గొంటారని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దొంతం పార్వతీశం, మణికొండ ఆదినారాయణమూర్తి తెలియజేశారు. ఈమేరకు సోమవారం స్థానిక హౌసింగ్బోర్డ్ కాలనీలో ఉన్న విశ్రాంతి ఉద్యోగ భవనంలో విడుదల చేసిన పత్రికా ప్రకటన సందర్భంగా వారు మాట్లాడుతూ వేతన సవరణ సమయంలో పెన్షనర్లకు కూడా పెరుగుదల (అప్డేషన్) చేసే నియమాన్ని ప్రశ్నార్థకం చేసే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వును ఉపసంహరించాలని కోరారు. న్యూ పెన్షన్ స్కీం బదులు తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ విధానం ఆమోదకరం కాదన్నారు. అందరికీ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అన్నది ఉద్యోగులు పెన్షనర్ల డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ పెన్షనర్లకు కనీసం రూ.9వేలు, కరవు భత్యం ఇవ్వాలన్నారు. పెన్షనర్లకు పూర్తిస్థాయి వైద్య సదుపాయం కల్పించాలన్నారు. రైల్వే రాయితీ పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులకు కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే 44 చట్టాలు బదులు తెచ్చిన నాలుగు కోడ్లు అమలు చేయరాదన్నారు. దేశ ప్రయోజనాలకు నష్టదాయకమైన ప్రైవేటీకరణ విధానాలు కేంద్ర ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కోశాధికారి పుల్లేపు సుధాకరరావు, ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దన్ రావు, సహాయ కార్యదర్శి ప్రగడ వాసుదేవ రావు పాల్గొన్నారు.



## ప్రపంచవ్యాప్తంగా రోటరీ సేవలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆదివారం స్థానిక వారాహి గ్రాండ్ ఫంక్షన్హాల్లో రోటరీక్లబ్ శ్రీకాకుళం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం నిర్వహించారు. కార్యక్రమానికి ఇనిస్టలేషన్ ఆఫీసర్గా విచ్చేసిన రోటరీ పూర్వ గవర్నర్ జి.విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన అంతర్జాతీయ రోటరీ సేవలు మరింత విస్తృతం చేయాలని, శాశ్వత ప్రాజెక్టులు చేపట్టాలని కోరారు. అనంతరం నూతన అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎస్పీ వివేకానంద మాట్లాడుతూ రోటరీ అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమన్నారు. ఐక్యతభావంతో ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న శ్రీకాకుళం క్లబ్ను కొనియాడారు. మున్ముందు మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. రోటరీక్లబ్ శ్రీకాకుళం 2025-26 నూతన కార్యవర్గం ఎన్నిక ముని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. నూతన అధ్యక్షులుగా బరాటం శ్రీనివాస, కార్యదర్శిగా కిల్లాన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ బమ్మిడి సందీప్, కోశాధికారిగా కందుల నవీన్ కుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.విజయకుమార్, క్లబ్ లెర్నింగ్ ఫెసిలిటేటర్గా అన్నెపు సత్యనారాయణ, యంగ్ లీడర్గా డాక్టర్ వారణాసి సందీప్, సర్వీస్ ప్రాజెక్ట్స్ అన్నెపు అనంతరావు, ఫౌండేషన్ చైర్ డి.శివ శంకర్, ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ పసగడ సూర్యనారాయణ, మెంబర్షిప్ చైర్ ఎం.ఆర్.కె.దాస్, పబ్లిక్ ఇమేజ్ మంత్రి వెంకటస్వామి, సర్వీస్ ప్రాజెక్ట్ దూసి సంతోష్, ఫెలోషిప్ చైర్ ఇప్పిలి వెంకన్నచెట్టి, సార్జంట్ ఎట్ ఆరమ్స్ వడగ సంతోష్లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, జెసిస్, లయన్స్క్లబ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.




## తెరవే కార్యక్రమాలు అభినందనీయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక 106వ నెల నెలవారీ సాహితీ సమ్మేళనం తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈనాటి కార్యక్రమంలో "ఫిరదౌసి" కావ్యంపై డాక్టర్ బారువ కోమలరావు సాహితీ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పూర్వపు జిల్లా విద్యాశాఖాధికారి బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ తెరవే విభిన్నరీతిలో సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆదర్శంగా వనిలవటం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రసంగకర్త డాక్టర్ బారువ కోమలరావు ను ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఇటీవల పదవీ విరమణ చేసిన రాష్ట్రస్థాయి పురస్కారాలు, ఉన్నత పదవులు పొందిన తెరవే సభ్యులు భోగెల ఉమామహేశ్వర రావు (ఉమాకవి), కుప్పిలి త్రినాథరావు, పి.తిరుపతిరావు, వావిలపల్లి రాజారావు, కిల్లాన శ్రీనివాస్, తెప్పల కృష్ణమూర్తిలను పూర్వపు జిల్లా విద్యాశాఖాధికారి, తెరవే గౌరవ అధ్యక్షులు బలివాడ మల్లేశ్వరరావు చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీతల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెరవే సభ్యులు చాడ శ్రీనివాస్, ఐ.యన్.డి ప్రసాద్, వాడాడ శ్రీనివాస్, టి.లింగరాజు, నిక్కు అప్పన్న, కె.బి.రవికిరణ్, ఇద్దీ పాపయ్య, యం.ఉపేంద్రశర్మ, తోట గోపాలరావు, తంగి ఎర్రమ్మ, యస్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కృష్ణదాస్ జన్మదిన వేడుకలు

(సత్యంన్యూస్, నరసన్నపేట)

మాజీ ఉప ముఖ్యమంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలు సోమవారం నరసన్నపేటలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల నుంచి పెద్దసంఖ్యలో పార్టీనేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం పార్టీశ్రేణులు నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ధర్మాన కృష్ణదాస్ ఆదర్శవంతమైన నాయకుడిగా, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే మానవతావాది అని కొనియాడారు. ఆయన



రాజకీయ జీవితం ప్రజలకు నిలువెత్తు దార్శనికంగా నిలుస్తుందన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టిన కార్యకర్తలు, నేతల మంచి పనికి ఆసుపత్రి సిబ్బంది ప్రశంసించారు. చివరగా పార్టీ శ్రేణులు అన్ని మండలాల నుంచి వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నిరుద్యోగం లేని సమాజం కావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిరుద్యోగం లేని సమాజం కావాలని శ్రీకాకుళం జేసీఐ వ్యవస్థాపకులు డాక్టర్ జామి బీమశంకర్, బీహెచ్ఆర్సీ వైస్ చైర్పర్సన్ డా.ఎన్.ప్రభ, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్ కుమార్ అన్నారు. ఈమేరకు సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6న శ్రీకాకుళంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ ఆధ్వర్యంలో భారీ ఉచిత ఉద్యోగమేళాను నిర్వహించామని, నిరుద్యోగ యువత ఈ ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకున్నారన్నారు. జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్కుమార్ సహకారంతో నిరుద్యోగ యువత కల నెరవేరిందన్నారు. ఈ ప్లేసెమెంట్ డ్రైవ్లో సుమారు 600 మంది జిల్లా నలుమూలల నుండి తరలివచ్చారన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగాలు సంపాదించారన్నారు. స్థానిక విద్యాదరి డిగ్రీ కళాశాలలో జూలై 6న భారీ ప్లేస్మెంట్ డ్రైవ్ నిరుద్యోగులకు వేదికైందన్నారు. ఈ ఉద్యోగమేళాలో సుమారు పదమూడు ఉద్యోగ సంస్థలు పాల్గొన్నాయన్నారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు మంచి అవకాశాన్ని అందించి ఉద్యోగాలను అందించటం హర్షణీయమన్నారు. ఈ మహా ఉద్యోగ మేళా శ్రీకాకుళం జిల్లాలో విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి పునాదన్నారు. కార్యక్రమంలో కొంక్యాన వేణుగోపాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాధ్యక్షులు బీహెచ్ఆర్సీ మాట్లాడుతూ ఇలాంటి ఉద్యోగ కల్పనతో, విద్యార్థుల జీవితాలను మార్చగల శక్తివంతమైన వేదికగా శ్రీకాకుళం నిలిచిందన్నారు. రానున్న రోజులలో తరచుగా ఉచిత ఉద్యోగమేళాలను నిర్వహిస్తామని, ఇందుకు జేసీఐ శ్రీకాకుళం సహకారం తీసుకుంటామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఉద్యోగ కల్పనే తమ అజండా అని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం ఉద్యోగమేళాలో భాగంగా జేసీఐ శ్రీకాకుళం మెయిన్ కార్యదర్శి తమ్మినేని ఉషారాణి, ఎన్.మణిశర్మ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా అధ్యక్షులు జ్యోతిర్మయి, జిల్లా మహిళా విభాగాధ్యక్షురాలు కె.సౌజన్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్.సూర్యనారాయణ, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు బిహెహెచ్ఆర్సీ, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సభ్యులు పోషక్కుమార్, రౌతు జగదీష్, నరేంద్ర, జామి కృష్ణకాంత్, కోరాడ రమేష్, పూర్వ ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ, నిరుద్యోగ యువత, విద్యాధరి కళాశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



## సమ్మెకు వామపక్షాల సంపూర్ణ మద్దతు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు వామపక్షాలు సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.ప్రకాష్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర కార్మికసంఘాల ఆధ్వర్యంలో జులై9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెకు మద్దతుగా జిల్లావ్యాప్తంగా సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ క్రాంతిభవనంలో జరిగిన సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. 2019లో కరోనా కాలంలో కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో 4లేబర్కోడ్లు తీసుకువచ్చిందన్నారు. దీనిలో భాగంగా ఫ్యాక్టరీస్, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టాలు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోనూ 8గంటల పని స్థానంలో 10గంటల పనిదినంగా మార్పు చేసిందన్నారు. రక్షణ సౌకర్యాలు కల్పించకుండా మహిళలతో రాత్రి షిఫ్టులలో పనిచేయించుకునేందుకు యాజమాన్యానికి స్వేచ్ఛ ఇస్తూ, శ్రామిక మహిళల హక్కులను కాలరాస్తూ చట్టంలో సవరణలు తెచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అడుగుజాడల్లో రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో తెచ్చిన సవరణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2022 విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని స్మార్ట్మీటర్లు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. వీటిపై జూలై 9న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామీణ ప్రాంతంలో ఆందోళనలకు పిలుపునిచ్చాయని, ఈ నేపథ్యంలో సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్ పాల్గొన్నారు.

















## ఐఐటి విద్యార్థులకు కలెక్టర్ అభినందన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మరింత ఉన్నతశిఖరాలను అందుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఐఐటిలో ర్యాంకులు సాధించిన పల్లా భరత్‌చంద్ర, బి.రోహిత్ దత్‌లను అభినందించారు. సోమవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఐఐటిలో ఆల్ ఇండియా 21వ ర్యాంకు సాధించి ముంబయి ఐఐటి సి.ఎస్.సీ.లో సీటు సంపాదించినట్లు పల్లా భరత్‌చంద్ర కలెక్టర్‌కు వివరించారు. తెలంగాణ ఎంసెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. పల్లా భరత్ చంద్ర తండ్రి పల్లా రామకృష్ణ చింతపల్లి వద్ద మెరైన్ పోలీస్ స్టేషన్, తల్లి అధికారి దమయంతి, పంచాయతీ కార్యదర్శిగా బెల్లమాంలో పని చేస్తున్నారు. మెయిన్స్‌లో ఆల్ ఇండియా 256వ ర్యాంకు సాధించిన మరో విద్యార్థి బి.రోహిత్ దత్‌కు గౌహతి ఐఐటిలో సి.యస్.సి. సీటు వచ్చినట్లు కలెక్టర్‌కు వివరించారు. తండ్రి బివియస్ సాయిరాం వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు ప్రధానోపాధ్యాయులు, తల్లి సిపిఓ లక్ష్మీ ప్రసన్న. వీరితో పాటు ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్‌కుమార్, జిల్లా రెవెన్యూఅధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్డిఎ పిడి కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వి శ్రీధర్‌రాజ తదితరులు వీరిని అభినందించారు.

## ఎచ్చెర్లవీధిలో 'తొలిఅడుగు'



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం ఎచ్చెర్ల వీధి 146 బూత్ పరిధిలో నిర్వహించారు. ప్రజలతో మమేకం అవుతూ పథకాలు చేరుతున్న విధానం గురించి మాజీ కౌన్సిలర్, డివిజన్ ఇన్‌ఛార్జి, రాష్ట్ర కాపు సాధికారిత సభ్యులు పాండ్రంకి శంకర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు ప్రధాన విజయరాం, 146 బూత్ ఇన్‌ఛార్జి ఉమ్మిడివరపు రాంబాబు, ముస్లిం మైనార్టీ నాయకులు ఎండీ రఫీ, యూనిట్ ఇన్‌ఛార్జి, 145వ బూత్ ఇన్‌ఛార్జిలు పాండ్రంకి రమేష్ నాయుడు, పాండ్రంకి రామానాయుడు, వార్డు సెక్రటరీ అనుపోజు పైడిబాబు, కర్రి పుష్ప పాల్గొన్నారు.

## 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

- విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు కావాలి
- ప్రతీ విద్యార్థి ఒక మొక్క నాటాలి
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలు మొదటి, రెండవ సంవత్సరాలకు సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యార్థులకు గత ఏడాది ఏమి చేశాము, ఈ విద్యాసంవత్సరంలో ఏమి చేయబోతున్నామనే అంశాలపై విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ప్రణాళికపై చర్చిస్తారన్నారు. విద్యార్థులకు విద్యకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా సమావేశంలో తెలియజేసుకోవచ్చున్నారు. సమస్యలు ఉన్నట్లయితే వాటిపై దృష్టి సారించాలని టీచర్లకు తెలియజేయాలన్నారు.

గ్రీన్ పాస్‌పోర్ట్ మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమైందని, ఏక్ పేర్ మాగీనామ్ కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ నుంచి మొక్కలు సరఫరా చేస్తారన్నారు. ప్రతీ విద్యార్థి పాఠశాల లేదా కళాశాల ఆవరణలో లేదా గృహాల వద్ద మొక్కలు నాటాలని, మొక్క నాటడంతో పాటు ఆరు నెలల పాటు మొక్క సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఇప్పటికే సూచనలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అదే రోజు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పేరెంట్స్, టీచర్స్, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు అందరూ వస్తే ఒక పండగ వాతావరణంలో కలసి భోజనం చేద్దామన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఘనంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

శ్రీకాకుళం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్ అండ్ బి బంగ్లా వద్ద రెడ్ క్రాస్ సొసైటీ చాప్టర్ ఉందని, పి.జగన్మోహనరావు ఆధ్వర్యంలో యూనిట్ ఉందన్నారు. మన జిల్లాకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రక్తదానానికి ఎప్పుడైనా పిలుపునిస్తే అవకాశం ఉన్నవారు రక్తం దానం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అతడి కబంధహస్తాల్లో బీసీ శాఖ బందీ!

(మొదటిపేజీ తరువాయి)


జీరుపాలెం బాలికల వసతి గృహంలో మహిళా ఉద్యోగిని గుణవతిని డమ్మీ చేసి బీసీ సంక్షేమశాఖతో సంబంధం లేని రిటైర్డ్ పురుష ఉద్యోగి ఆచారి తిష్ట వేసి వ్యవహారాలు నడుపుతుండటంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. గుణవతిని ముందు పెట్టి తెరవెనుక కొమరవానిపేట, జీరుపాలెం హాస్టళ్లకు వార్డెన్‌గా చెలామణీ అవుతున్న ఆచారిపై ఉన్నతాధికారులు, బీసీ సంక్షేమశాఖ అధికారికి పలువురు అనేకమార్లు ఫిర్యాదులు ఇచ్చినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని విమర్శలున్నాయి.

**ఆమె లోపాలే.. అతనికి వరాలు**

తొలుత అటెండర్‌గా ఉన్న గుణవతి వార్డెన్‌గా ఉద్యోగోన్నతి పొందడానికి శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పేరుతో ఫేక్ డిగ్రీ సర్టిఫికేట్ సమర్పించినట్టు అభియోగాలున్నాయి. దీని జెన్యూనిటీని నిర్ధారించకుండానే ప్రమోషన్ ఇచ్చేశారు. దీనిపై అనేక ఫిర్యాదులు వచ్చినా ప్రస్తుత, గత బీసీ సంక్షేమ శాఖ డీడీలు డబ్బులు తీసుకొని వాటిని పక్కన పడేశారన్న విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఆచారి ప్రమేయం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఫేక్ డిగ్రీ సర్టిఫికేట్ తయారు చేయించింది కూడా ఆచారేనని అభియోగం ఉంది. జెన్యూనిటీ నిర్ధారణకు శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీకి బీసీ సంక్షేమశాఖ రిఫర్ చేయకుండానే, ఆ వర్సిటీ జెన్యూనిటీ ఇచ్చినట్టు ఒక ఫేక్ సర్టిఫికెట్ క్రియేట్ చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. సదరు సర్టిఫికెట్‌లో యూనివర్సిటీ రాజముద్ర లేకపోగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సంతకం పెట్టాల్సిన చోట డిప్యూటీ రిజిస్ట్రార్ సంతకం ఉందన్న అభియోగాలు ఉన్నాయి. వీటిని పట్టించుకోకుండానే గుణవతిని వార్డెన్‌గా ప్రమోట్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. జీరుపాలెం వసతి గృహంలో బాలికల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని కొన్ని రోజుల క్రితం జిల్లా ఎస్పీకి గ్రీవెన్స్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారని తెలిసింది. దీనిపై నిజ నిర్ధారణ జరగాల్సి ఉంది. శాఖతో సంబంధం లేని ఆచారి బీసీ సంక్షేమ శాఖలో పని చేస్తున్న మహిళా వార్డెన్ల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దూషిస్తున్నారని, కార్యాలయ విధులకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడుతున్నారంటూ గత ఏడాది మే 28న ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి బాధితులు ఫిర్యాదు చేశారు. దీన్ని విచారణ కోసం జిల్లా బీసీ సంక్షేమ శాఖకు పంపించారు. కానీ బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారులు దాన్ని తొక్కిపెట్టి ఆచారిని కాపాడారని విమర్శలున్నాయి. సదరు ఫిర్యాదుపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**తప్పుడు బిల్లులతో ఖజానాకు చిల్లు**

కోవిడ్ కారణంగా జిల్లాలోని అన్ని వసతి గృహాలతోపాటు కొమరవానిపేట, జీరుపాలెం హాస్టళ్లను కూడా రెండు నెలలు పాటు మూసేశారు. వేసవి సెలవుల తర్వాత కూడా ఈ రెండు హాస్టళ్లను తెరవలేదు. అప్పట్లో దీనిపై అన్ని ప్రధాన దినపత్రికల్లో వార్తలు వచ్చాయి. కానీ ఆ హాస్టళ్లను తెరిచి విద్యార్థులకు ఆశ్రయం కల్పించినట్టు వార్డెన్ గుణవతి ద్వారా ఆచారి బిల్లు పెట్టించి ప్రభుత్వ ఖజానాకు రూ.2 లక్షల మేరకు చిల్లు పెట్టారు. ఆడిట్, పత్రికల ద్వారా ఇది బయటపడటంతో దీనిపై విచారణకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీని ఉన్నతాధికారులు నియమించారు. ఆ మేరకు విచారణాధికారి వార్డెన్ గుణవతికి నోటీసులు ఇస్తే.. ఆమె బదులు ఆచారే సంతకం పెట్టి రిప్లై స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీన్ని తిరస్కరించగా.. బీసీ సంక్షేమ అధికారితో చేతులు కలిపి ఎస్సీ కార్పొరేషన్ అధికారిని బెదిరించి విచారణ జరగకుండా అడ్డుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. వీరి ఒత్తిడి కారణంగానే విచారణాధికారి తప్పుకున్నట్లు చెబుతున్నారు. ఆ తర్వాత కలెక్టర్ కూడా బదిలీ కావడంతో నిధుల దుర్వినియోగంపై విచారణను జరగకుండా చేస్తున్నారు.



వినతి పత్రం

మహారాజశ్రీ శ్రీకాకుళం జిల్లా కలెక్టరు వారి దివ్యసముఖమునకు,

రణస్థలం మండలం, కొమరవానిపేట గ్రామపెద్దలు, పురజనులు నమస్కరించి వ్రాసుకున్న ధరఖాస్తు విన్నపములు.

విషయం : కొమరవానిపేట, జీరుపాలెం బాలుర, బాలికల వసతి గృహాలు వార్డెన్‌గా ఇన్‌చార్జిగా ఏకైక వ్యక్తి 6సం.లు పైబడి విధులు బాధ్యతాయుతంగా లేనందున చర్యలు తీసుకోమని కోరుటగూర్చి.

అయ్యా!

కొమరవానిపేట, జీరుపాలెం గ్రామాలు మత్స్యకార గ్రామాలు బాలుర, బాలికల వసతిగృహాలు (బి.సి.వెల్‌ఫేర్ హాస్టల్స్) గలవు. ఈ రెండు హాస్టల్స్‌కి వార్డెన్‌గా ఇన్‌చార్జిగా గొర్లి గుణవతిగారు ఉంటూ, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలుని తుంగలో తొక్కి, ఇన్‌చార్జిగా ఉన్న స్థానంలో తనకు నచ్చిన వ్యక్తిని, రిటైర్డ్ ఉన్న వ్యక్తిని పెట్టి హాస్టల్ నడిపిస్తుంది. బాధ్యతగా విధులు నిర్వహించడం లేదు. నెలకో ఒకసారి హాస్టల్ చూచి వెళ్తుంది. సక్రమంగా మెనూ పిల్లలకు అందివ్వటం లేదు. దొంగ సర్టిఫికేట్లు (ఫేక్ సర్టిఫికేట్సు) తయారుచేసి ఉద్యోగం చేస్తుంది. అవినీతి, అక్రమాలుకి పాల్పడుతుంది. పిల్లలు తల్లిదండ్రులుగా, పెద్దలుగా నిలదీస్తే బాధ్యతగా సమాధానం ఇవ్వలేదు.

గావున తమరు పెద్ద మనస్సుతో స్పందించి, దర్యాప్తు జరిపించి, చట్టపరమైన చర్యలు గైకొనవలసినదిగా కోరుచున్నాము.

చిత్తగించవలెను

ఇట్లు
కొమరవానిపేట గ్రామపెద్దలు
పిల్లలు తల్లిదండ్రులు

స్థలం : కొమరవానిపేట
తేది:

**ఆరా తీస్తున్న ఏసీబీ**

ఇటీవల జరిగిన బదిలీలు, డిప్యూటేషన్లు, వసతి గృహాలకు ఇన్‌ఛార్జీల నియామకాల్లో కూడా ఏమాత్రం సంబంధం లేని ఆచారితో కలిసి నిర్ణయాలు తీసుకున్నట్టు ఆ శాఖ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. రిటైర్డ్ ఉద్యోగి అయిన ఆచారిని బీసీ సంక్షేమశాఖ అధికారిణి కార్యాలయానికి పిలిపించి సమావేశం కావడంలో ఆంతర్యం ఇదేనని ఆరోపిస్తున్నారు. శాఖలో ఉద్యోగులు, వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, జిల్లా కార్యాలయం వేదికగా చేస్తున్న అక్రమ వసూళ్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లకుండా కలెక్టరేట్ ఏవో, కలెక్టర్ సీసీలను మేనేజ్ చేస్తున్నట్లు తెలిసింది. జిల్లా మంత్రి, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే పేషీలో ఉన్న సీసీలను సైతం ప్రలోభపెట్టి ఉన్నతాధికారులు నుంచి ఇబ్బందులు రాకుండా చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ఏసీబీ అధికారులు బీసీ సంక్షేమశాఖ నుంచి వివరణ కోరడంతో పాటు, జాబితాలు ఇవ్వాలని సూచించినట్టు తెలిసింది.

## 10న టెలిగ్రాఫ్ సంఘం మహాజన సభ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న ది టెలిగ్రాఫ్ ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజన సభకు సభ్యులందరూ హాజరు కావాలని సబ్ డివిజన్ కోపరేటివ్ అధికారి ఎం.చంటిబాబు ఒక ప్రకటనలో కోరారు. ఉన్నతాధికారులు తనకు లిక్విడేషన్ అధికారిగా నియమించినందున, సంఘం ఆస్తి, అప్పులకు సంబంధించి నోటీసులు జారీచేసి క్లయిములను పరిష్కరించామని, సంఘం లిక్విడిటి పూర్తి చేయటకు వీలుగా ఈ నెల 10న జరిగే మహాజన సభకు సభ్యులందరూ హాజరై చర్చించాలని వివరించారు.

## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నాయకుడు ముఖేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, అధ్యక్ష కార్యదర్శులు కె.వేణుగోపాల్, కళ్యాణి అప్పలరాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రాష్ట్రంలోని నగర పంచాయతీ, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని, రిటైర్మెంట్ అయిన మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల స్థానాల్లో వారి పిల్లలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మున్సిపల్ ఇంజనీరింగ్ నాయకులు జయశ్రీ, రాజ్యలక్ష్మి, మాధురి, సరస్వతి, లక్ష్మి, శాంతి, జె.గురుమూర్తి, పార్థసారథి, గణేష్, మనీ, సూర్యకళ, లక్ష్మి, రసూల్, సోషల్ మీడియా ప్రతినిధి అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## సూపరింటెండెంట్‌కు గ్రేడ్-3 ఏఎన్ఎంల సెగ

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు గడువు చివరి రోజు వరకు కౌన్సెలింగ్ నిర్వహించి హడావుడిగా జాబితాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులు నివేదించారని, వాటినే అధికారులు ఓకే చేసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఏపీఎన్జీవోలు, జిల్లా జేఏసీ నాయకులతో కలిసి బాధిత ఏఎన్ఎంలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. బదిలీల కౌన్సెలింగ్‌లో అక్రమాలకు పాల్పడిన విషయంపై అనేక ఫిర్యాదులు వచ్చినా, వాటిని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారించలేదని విమర్శించారు. గతంలో ఎన్నడూ ఈ మాదిరిగా కౌన్సెలింగ్ జరగలేదని బాధిత ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యఆరోగ్య శాఖ అధికారులు బదిలీల్లో రోస్టర్ పాటించకపోవడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్-6కు విరుద్ధంగా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించినట్టు కలెక్టర్‌కు ఏపీఎన్జీవో నాయకులు సాయిరాం వివరించిన తర్వాత కొంత సందిగ్ధం నెలకున్నా రీకౌన్సెలింగ్ నిర్వహించడానికి ఉన్నతాధికారులు సుముఖత చూపలేదు. వాస్తవంగా జిల్లాలో సచివాలయ బదిలీల్లో గ్రామ సర్వేయర్ల కౌన్సిలింగ్ నిర్వహించినా ఆర్డర్లు ఇవ్వలేదు. గత నెల 30 నాటికి బదిలీలు చేయాల్సి ఉండగా, ఈ నెల 1న కౌన్సెలింగ్ ప్రారంభించి అర్థాంతరంగా నిలిపేశారు. వీరికి ప్రభుత్వం 5వ తేదీలోగా బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించింది. దీంతో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరికి పోస్టింగ్ ఆర్డర్లు మాత్రం ఇవ్వలేదు. వీటిపై ఈ నెల 5వ తేదీ వేసి ఆర్డర్లు ఇవ్వడానికి అధికారులు సిద్ధమయ్యారు. వీరి మాదిరిగానే సచివాలయ ఏఎన్ఎంల విషయంలో జీవో 6 ప్రాప్తికి కౌన్సెలింగ్ నిర్వహించాలని 70 శాతం మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలు డిమాండ్ చేస్తున్నారు. రూరల్ నుంచి అర్బన్‌కు అడ్డదారిలో వచ్చిన ఏఎన్ఎంలు మినహా మిగతావారంతా అసంతృప్తితో ఉన్నారు. ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్సులను అధికారులు పక్కన పెట్టేశారని ఆరోపణలు ఉన్నాయి. అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని బాధిత ఏఎన్ఎంలు జిల్లా ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్నారు. సచివాలయం ఉద్యోగుల బదిలీల్లో అన్నీ సవ్యంగా సాగినా, వైద్యఆరోగ్యశాఖ పరిధిలో సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలు విషయంలో శాఖ అధికారులు తీవ్ర అన్యాయం చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. వీటికి బలం చేకూర్చే విధంగా గ్రేడ్-3 ఏఎన్ఎంలు లేవనెత్తిన కౌన్సెలింగ్ లోపాలపై వైద్యఆరోగ్య శాఖ అధికారులు ఎవరూ సమాధానం చెప్పలేక చేతులెత్తేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్వాకంపై అన్నివైపుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.



ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవి కుమార్ ఎస్ఆర్‌సీ పేట గ్రామంలో రైతన్నలకు ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న పశువుల దాణాను పంపిణీ చేశారు. ముందుగా ఆమదాలవలస మండలంలోని ఎస్ఆర్‌సీ పేట గ్రామంలో కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే రూ.1.03 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజ్, కాలువలను ప్రారంభించారు.

**- సత్యంన్యూస్, ఆమదాలవలస**

## దాసన్నకు శుభాకాంక్షలు తెలిపిన సూరిబాబు



(సత్యంన్యూస్, విశాఖపట్నం)

వైకాపా జిల్లా అధ్యక్షులు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ జన్మదినం సందర్భంగా వైకాపా సీనియర్ నాయకులు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం విశాఖపట్నంలోని కృష్ణచైతన్య నివాసంలో దాసన్నను కలిసిన సూరిబాబు దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు వైకాపా నాయకులు కొండబాబు, తంగుడు నాగేశ్వరరావు, సకలా బత్తుల సతీష్ ఉన్నారు.

## ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం గొంటి వీధిలో ఘనంగా నిర్వహించారు. అలాగే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు జరిపారు. గొంటివీధి ఎంఆర్‌పీఎస్ యువత, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేశారు. ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని డప్పులతో ఊరేగింపు నిర్వహించి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో తొత్తరమూడి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ కృష్ణమాదిగ 31 ఏళ్ల పోరాటంలో ఎన్నో ఆటుపోట్లు, సవాళ్లను అధిగమించి వర్గీకరణ సాధించిన విజయం గురించి వివరించారు. మంద కృష్ణమాదిగ నాయకత్వంలో శ్రీకాకుళం జిల్లా యువత, గొంటివీధి ఎంఆర్‌పీఎస్ యువత కమిటీల్లో పాల్గొని వర్గీకరణ రాజ్యాంగం ఫలాలు జాతి బిడ్డలకు అందేలా చూడాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు గొంటి జగదీష్ మాదిగ, లోపింటి కృష్ణ మాదిగ, దీర్ఘాసి హరీష్‌కుమార్ మాదిగ, కంటిపాక హిమశేఖర్ మాదిగ, కానుకుర్తి గోవింద్ మాదిగ, సవలాపురపు వెంకటమణ, చిన్న కొండలరావు మాదిగ, ఇద్దిమాల సుజాత మాదిగ, కురమాన భారతి మాదిగ, గొంటి రాము, రామకృష్ణ, అంజి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపునీత్ రాజకుమార్ అసోసియేషన్ సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇటీవల నరసన్నపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన నరసన్నపేట ఇందిరానగర్ కాలనీకి చెందిన కె.శామ్‌చరణ్‌కు శ్రీ పునీత్ రాజకుమార్ అసోసియేషన్ సాయమందించింది. సహచరుల ద్వారా విషయం తెలుసుకున్న పుక్కళ్ల నాగేంద్ర శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బాధితుని తల్లిదండ్రులకు కొంత ఆర్థిక సహాయం అందించారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.